సాక్షి వరంగల్

గురువారం । 24 । ఆగస్టు । 2023



దివ్యాంగులకు మరింత ఆసరా

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంచి ఆదుకుంటుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 10లో▸



బది'లీలలు'

- 10లో▸

సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆశీర్వాదంతో నచ్చిన దగ్గర పోస్టింగ్ పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గరిష్టం/కనిష్టం
$31^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలి : కలెక్టర్



కరీమాబాద్: జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పనిచేయని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. లింగ వ్యత్యాసం ఉన్న మండలాలను గుర్తించి ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు మాట్లాడుతూ జిల్లాలో లింగ వ్యత్యాసం ఉన్న మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి సహకరిస్తామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సీ సీఆర్‌బీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం దరఖాస్తులు చేసుకున్న స్కానింగ్ సెంటర్లకు అప్రూవ్ చేశారు.

ట్రెయినీ కలెక్టర్ల పర్యటన



నల్లబెల్లి: మండలంలోని రాంపూర్, రేలకుంట గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్ల బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా మౌలిక వసతులు, ఆరోగ్య, వర్షాధార పరిస్థితులు, ఉపాధి హామీ పనులు, చేనేత కార్మికుల ఇళ్లను పరిశీలించారు. అనంతరం గొర్రెలకాపరులతో మాట్లాడారు.ట్రెయినీ కలెక్టర్లు సందీప్‌కరియత్, పవన్‌రావల్, పంకజ్‌గార్గ్, భూపేంద్రసింగ్ మీనా, నిల్‌మనికుమార్, దాట్ల అరవింద్‌రాజ్, సింగ్‌శరత్‌దినేష్, సోనువర్మ, వివేక్‌కుమార్‌మీనా, గౌతమ్‌అగర్వాల్ పథకాల అమలుతీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీఓ ప్రకాశ్, సర్పంచ్‌లు సురేష్, రత్నాకర్‌రావు, ఉపసర్పంచ్ రాజేందర్, కార్యదర్శులు పోతుర్ల రంజిత్, సరస్వతి తదితరులు ఉన్నారు.

నర్సంపేట అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

నర్సంపేట: నర్సంపేట మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.20 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓ 630 ద్వారా మంత్రి కేటీఆర్ హామీలో భాగంగా టీయూఎఫ్‌ఐడీసీ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. అంతర్గత సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించినట్లు తెలిపారు. తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సామర్థ్యాలను పెంపొందించాలి : డీఈఓ

కాజీపేట సెంటర్: పాఠశాలల్లోని అన్ని వనరులను ఉపయోగించుకుని ఉన్నతి కార్యక్రమాన్ని అమలుచేసి పిల్లల్లో సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి హెచ్‌ఎంలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యాశాఖ అధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ వాసంతి మాట్లాడారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.సారయ్య, కోర్సు కోఆర్డినేటర్, డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, రిసోర్స్ పర్సన్స్ కట్ల శ్రీనివాస్, వి.మురళి, ఆనందం, రాంజీ, ఎంఈఓ ఎన్.విజయ్‌కుమార్, చక్రవర్తుల శ్రీనివాస్, ఏవీఆర్.చార్యులు, సీహెచ్.నాగేశ్వర్‌రావు, ఎండీ.అజీజ్, లక్ష్మణ్, శ్రీనివాస్, అశోక్, రమేష్, గురుదేవ్, లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలి : బీజేపీ

రాయపర్తి: బీఆర్‌ఎస్ కుటుంబ పాలనకు తెలంగాణ ప్రజలు, మేధావులు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని కర్ణాటకలోని హుబ్లీ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే మహేష్ తంగినకై అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు వడ్డకొండ రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్యగౌడ్, లేగ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతుల ఇన్‌చార్జ్ పాకనాటి దామోదర్‌రెడ్డి, పూసల శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్, రంగు రాము, దొంగరి పాల్గొన్నారు.

చందమామ అందిన వేళ..

విక్రమ్ సాఫ్ట్ ల్యాండింగ్‌తో జిల్లాలో సంబురాలు

- టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు
- త్రివర్ణ పతాకాలు చేతబూని ర్యాలీలు

నెక్కొండ: అంతరిక్ష పరిశోధనల చరిత్రలో ఇస్రో సరికొత్త రికార్డు సృష్టించింది. చంద్రుని ఉపరితలంపై చంద్రయాన్–3 బుధవారం విజయవంతంగా ల్యాండింగ్ కావడంతో జిల్లా ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు పాఠశాలల్లో చంద్రయాన్–3 ల్యాండింగ్‌ను ప్రత్యక్ష ప్రసారాల్లో విద్యార్థులు తిలకించి సంబురాలు చేసుకున్నారు. జయహో భారత్ అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా కేరింతలు కొట్టారు. త్రివర్ణ పతాకాలు చేతబూని ర్యాలీలు తీశారు.

గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు..

చంద్రయాన్–3ని పాఠశాలల్లోనే ప్రసారం చేయాలని మొదట నిర్ణయించినా.. సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత ఉండడంతో వాయిదా వేశారు. అయినా కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఉండి ప్రత్యక్ష ప్రసారం చూశారు. అదేవిధంగా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏ ఇంట్లో చూసినా పిల్లలు, పెద్దలు టీవీలకు అతుక్కుపోయారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో ప్రాజెక్టు ఆఫీసర్లు రాకేష్, వెంకటేశ్వర్‌రావు చంద్రయాన్–3 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రాజెక్టర్ ఏర్పాటు చేశారు. నగర ప్రజలు సైన్స్ సెంటర్‌లో చంద్రయాన్–3 లాంచింగ్‌ను లైవ్‌గా వీక్షించేందుకు ఆసక్తి కనబరిచారు. బుధవారం సాయంత్రం 5.44 గంటల నుంచి 6.04 గంటల వరకు కొనసాగిన లైవ్‌ను విద్యార్థులు వీక్షించారు. అంతకుముందు చంద్రయాన్–3 వివరాలను శాస్త్రవేత్తలు వారికి వివరించారు. ప్రయోగం విజయవంతం కావడంతో భారత్ మాతాకీ జై, భారతీయ శాస్త్రవేత్తలకు జై అంటూ సైన్స్ సెంటర్ నిర్వాహకులు ,సిబ్బంది జాతీయ జెండాతో సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ (నిట్) వరంగల్‌లోని ఆడిటోరియంలో చంద్రయాన్–3ని లైవ్‌గా వీక్షించారు. ప్రయోగం విజయవంతం కాగానే విద్యార్థులు, అధ్యాపకులు సంబురాలు జరుపుకున్నారు. తాము సైతం శాస్త్రవేత్తలుగా రాణిస్తామని, చంద్రయాన్–3 స్ఫూర్తినిచ్చిందంటూ విద్యార్థులు కేరింతలు పెట్టారు.



గీసుకొండ : మచ్చాపూర్‌లో సంబురాలు చేసుకుంటున్న మచ్చాపూర్ యువసేన బాధ్యులు





చెన్నారావుపేట : చంద్రయాన్-3 విజయవంతం కావడంతో సంబురాలు చేసుకుంటున్న విద్యార్థులు

చంద్రయాన్ విజయంలో హనుమకొండ జంట

హన్మకొండ: చంద్రయాన్–3 విజయవంతంలో హనుమకొండ జంట భాగస్వామ్యం ఉంది. నగరంలోని అశోక కాలనీకి చెందిన గొట్టిముక్కుల ప్రవీణ్‌రెడ్డి, సుష్మ దంపతులు ఇస్రోలో శాస్త్రవేత్తలుగా పనిచేస్తున్నారు. అశోక కాలనీకి చెందిన గొట్టిముక్కుల రమాదేవి, మన్మథరెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి 2011 సెప్టెంబర్ 16నుంచి బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. మూడు పదోన్నతులు పొంది ప్రస్తుతం డైరెక్టర్ హోదాలో ఉన్నారు. ఆయన సతీమణి సుష్మ కూడా ఇస్రోలోనే శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. విక్రమ్ రోవర్ చంద్రుడిపై అడుగిడడంలో ఇతర శాస్త్రవేత్తలతో కలిసి వీరు పాలు పంచుకున్నారు. విక్రం ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగగానే తన కోడలు ఫోన్ చేసి విజయవంతంగా ల్యాండ్ అయిందని, ఎంతో సంతోషంగా ఉందని చెప్పిందని మామ గొట్టిముక్కుల మన్మథరెడ్డి తెలిపారు. మన్మథ రెడ్డి పోలీస్‌శాఖ ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా రిటైర్ య్యారు.





గొట్టిముక్కుల ప్రవీణ్ రెడ్డి-సుష్మ

చంద్రయాన్-3లో మానుకోట శాస్త్రవేత్త

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం సోమ్లతండా గ్రామానికి చెందిన భూక్య రమేష్ ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్–3 ప్రయోగం సందర్భంగా ఇస్రోలోని ప్రధాన శాస్త్రవేత్తలతో కలిసి రమేష్ కూడా పాల్గొన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన భూక్య భీముడు, లక్ష్మి దంపతుల మూడవ కుమారుడు అయిన రమేష్ ఇస్రోలో నాలుగేళ్లుగా కమ్యూనికేషన్ విభాగంలో పని చేస్తున్నారు. చంద్రయాన్ 2, చంద్రయాన్ 3 ప్రయోగం సమయంలో ఇక్కడే ఉండడం తనకు ఎంతో గర్వంగా ఉందని రమేష్ చెప్పారు. ఈసారి విజయవంతం కావడం భారత దేశ ప్రజల గొప్పతనమని పేర్కొన్నారు.



చంద్రయాన్ ప్రయోగం వీక్షించే వేదిక వద్ద శాస్త్రవేత్త భూక్య రమేష్

విద్యార్థులకు స్ఫూర్తి..



పాఠశాలలో సాయంత్రం చంద్రయాన్–3 ప్రయోగ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూశాను. ఉపగ్రహం విజయవంతంగా చంద్రుడిపై దిగగానే సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాం. శాస్త్రవేత్తలు చేసిన ఈ ప్రయత్నంలో విజయం సాధించడంతో మన దేశం శాస్త్రసాంకేతిక రంగంలో దూసుకుపోతోంది. భవిష్యత్‌లో ఇలాంటి ప్రయోగాలు మా లాంటి విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని ఆశిస్తున్నా.

– ఎం.కార్తీక, 10వ తరగతి, విద్యోదయ హైస్కూల్, నెక్కొండ

గర్వకారణం..



మన శాస్త్రవేత్తలు చంద్రుడి మీదికి పంపిన చంద్రయాన్–3 ఉపగ్రహం సురక్షితంగా ల్యాండయ్యింది. దానిలో ఉన్న రోవర్ మన శాస్త్రవేత్తలు అనుకున్న విధంగానే చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ఉన్న ఖనిజ సంపదను కనుక్కుంటే అది మన భావితరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది మన దేశానికి ఎంతో గర్వకారణం.

– బి.రంజిత్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, నెక్కొండ

ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



వర్ధన్నపేటలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు



వర్ధన్నపేటలో చికిత్స చేయించుకుంటున్న శ్రీధర్

వర్ధన్నపేట: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చేప్పే సమయం ఆసన్నమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వర్ధన్నపేటలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో చేయికి తీవ్ర గాయమైంది. అస్వస్థతకు గురి కావడంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే అందుతున్నాయని ఆరోపించారు. అందినంత దండుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యే అరూరి రమేష్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువుకు గండి పడి మూడేళ్లు దాటినా పనులు పూర్తికాలేదని పేర్కొన్నారు. కాకతీయుల కాలం నాటి మత్తడిని తొలగించిన ఘనత అరూరి రమేష్‌కే దక్కుతుందన్నారు. నాయకులు ముత్తిరెడ్డి కేశవరెడ్డి, కుందూరు మహేందర్‌రెడ్డి, చీటూరి రాజు, మల్లెపాక అనిల్ పాల్గొన్నారు.

కొండేటి శ్రీధర్‌పై పోలీసుల దాడిని ఖండించిన ఈటల

హన్మకొండ : బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పై పోలీసులు దాడి చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఖండించారు. ప్రజలకు హామీలు ఇచ్చి అమలు చేయని ప్రభుత్వాన్ని నిలదీసి, ప్రజల పక్షాన నిలబడే గురుతర బాధ్యత ప్రతిపక్షాల మీద ఉందని, ఆ బాధ్యత నిర్వర్తిస్తున్న బీజేపీ నాయకులపై పోలీసుల చేత కేసీఆర్ ప్రభుత్వం దాడి చేయిస్తోందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల దాడిలో కొండేటి శ్రీధర్ చేయి విరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన బీజేపీ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండేటి శ్రీధర్‌ను ఫోన్‌లో ఈటల రాజేందర్ పరామర్శించారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి: కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లెసెన్స్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్ల సమృద్ధిగా చెరువుల్లోకి చేరడంతో రైతులు రెండు పంటలు పండిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇక్కడి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో తన కూతురు, కుమారుడితోపాటు స్నేహితులు అందించిన సహకారంతో ఆనందయ్య మందు, నిత్యావసర సరుకులను పాలకుర్తి నియోజకవర్గంలో పంపిణీ చేశానని అన్నారు. ట్రస్ట్ ద్వారా మహిళలకు కుట్టుశిక్షణతోపాటు కుట్టుమిషన్లను అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 20 వేల మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లను ఇప్పిస్తున్నట్లు చెప్పారు. అందుకోసం 4 కోట్ల రూపాయలు ఖర్చవుతున్నా ప్రజలకే అందిస్తున్నాననే సంతృప్తి ఉందన్నారు. అనంతరం మండల కేంద్రంలో జర్నలిస్టులకు నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను మంత్రి పరిశీలించారు. ఆర్డీఓ అఫ్రిన్‌సిద్దిఖీ, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సర్పంచ్,ఎంపీటీసీలు గారె నర్సయ్య, కందికట్ల స్వామి, కోదాటి దయాకర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, సూదుల దేవేందర్, ఐత రాంచందర్ పాల్గొన్నారు.



ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

డాక్టర్‌కు సన్మానం

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన రంగు రజిత-కుమార్‌గౌడ్ కుమారుడు ప్రణయ్‌గౌడ్ ఆదిలాబాద్ జిల్లాలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 2017 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఈనెల 13న పట్టా పొందాడు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పర్వతగిరిలోని ఆయన నివాసంలో బుధవారం ప్రణయ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి శాలువాతో ఆయనను సన్మానించి అభినందించారు. పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, ఎంపీటీసీ మాడుగుల రాజు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో సంగెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి పాలన లేదని మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. తనకు మరోమారు ప్రజా సేవ చేసే అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు సాగర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు శ్రీనివాస్, వీరేశం, రాంగోపాల్‌రావు, పురుషోత్తం, నరేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం 283 మంది లబ్ధిదారులకు రూ.2.83 కోట్ల విలువైన బీసీ కుల వృత్తుల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 5,690 దరఖాస్తులు రాగా అందులో 4632 దరఖాస్తులను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ దశలవారీగా ఆర్థిక సాయం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణంలోని 24వ వార్డుకు చెందిన గండి నాగేంద్రబాబుకు రూ.2లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దార్ల రమాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నర్సంపేట మండలం కొండసముద్రంతండాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు, రాజుపేట, ముత్తోజిపేటకు చెందిన 120 కుటుంబాలు, చెన్నారావుపేట మండలం అమీనాబాద్, అడ్డబాటతండా, గొల్లభామతండాకు చెందిన 110 కుటుంబాలు, నెక్కొండ మండలం చంద్రుగొండ, పనికరకు చెందిన 50 కుటుంబాలు, చెన్నారావుపేట మండలం ఎల్లాయగూడేనికి చెందిన 10 కుటుంబాలు, నల్లబెల్లి మండలం కన్నారావుపేట, ముచ్చింపుల, దస్తగిరిపల్లిలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన 25 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



బీసీ కులవృత్తిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

అవినీతికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ వసుమతి

చెన్నారావుపేట: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతికి పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని ఉపాధి హామీ అడిషనల్ పీడీ వసుమతి హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మొదట లింగగిరిలో జరిగిన ఈజీఎస్ పనులపై చర్చ జరిగింది. ఉపాధి హామీలో నాటిన మొక్కలు చనిపోయాయని, వాటి స్థానంలో వేరే మొక్కలు నాటలేదని తేలింది. ఖాదర్‌పేట గ్రామంలో 380 మొక్కలకు 180 మొక్కలే బతికి ఉండగా.. 380 మొక్కలకు నాలుగుసార్లు నీరు పట్టి బిల్లులు తీసుకున్నట్లు డీఆర్పీలు తెలిపారు. అలాగే, పలు గ్రామాల్లో రికార్డులు పూర్తి చేయలేదని, తవ్విన గుంతలు పూడ్చి వేశారని వివరించారు. బిల్లులు చెల్లింపులో కూలీల సంతకాలు లేవని పేర్కొన్నారు. కాగా, ప్రజావేదికకు ఇద్దరు ముగ్గురు సర్పంచ్‌లే వచ్చారు. సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ అధికారి రమణి, ఏపీడీ సాయిచరణ్, గోపయ్య, ఎంపీపీ బాదావత్ విజేందర్, భిక్షపతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, సూపరిటెండెంట్ దయాకర్ పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట: తెలంగాణ పథకాలు దేశంలోనే ఆదర్శమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. వర్ధన్నపేట పట్టణ పరిధిలోని 21 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఐదుగురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దనే ఆలోచనతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలకు సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించనున్నట్లు వివరించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్లు తహసీల్దార్ విజయసాగర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎంఎంఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గంలోని దివ్యాంగులకు పెంచిన పింఛన్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌ను రూ.3,116 నుంచి రూ.4,116కు పెంచి సీఎం కేసీఆర్ దివ్యాంగుల మనసు దోచుకున్నారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో 52,065 మంది దివ్యాంగులకు పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఓ సంపత్‌రావు,ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ,పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నా, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, తహసీల్దార్ విజయసాగర్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

9 మంది డీబార్

కేయూ క్యాంపస్ : కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ సెకండియర్ పరీక్షల్లో రెండు పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. 9 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. జనగామ ఏబీవీ ప్రభుత్వ కళాశాలలో ఆరుగురు, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు మొత్తం 9 మంది డీబార్ అయినట్లు వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ మార్గాలలో ప్రయాణించే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం రద్దు చేశారు. విజయవాడ రూట్‌లో మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన ట్రాఫిక్ కమ్ పవర్ నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ చేపట్టిన కారణంగా పలు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే..

సంబల్‌పూర్–నాందేడ్ (20809) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 25, 27, 28వ తేదీల్లో, నాందేడ్–సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్ 26, 28, 29వ తేదీల్లో, విశాఖపట్నం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ 26,29వ తేదీల్లో, నాందేడ్–విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్ 27,30వ తేదీల్లో రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

మోడల్ రైల్వే బంగ్లాలు ప్రారంభం



రైల్వే బంగ్లాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో అధికారుల కోసం నిర్మించిన మూడు మోడల్ రైల్వే బంగ్లాలను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ బుధవారం ప్రారంభించారు. బెల్లంపల్లి–కాజీపేట జంక్షన్ తనిఖీలో భాగంగా డీఆర్‌ఎం కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. అనంతరం రైల్వే ఎలక్ట్రికల్ లోకోషెడ్ కాలనీలో మెయిన్‌రోడ్‌లో నిర్మించిన మూడు మోడల్ రైల్వే బంగ్లాలను ప్రారంభించారు. అద్భుత బంగ్లాల నిర్మాణానికి కృషి చేసిన అధికారుల బృందాన్ని అభినందించి రూ.10 వేల క్యాష్ అవార్డు ప్రకటించారు. అనంతరం రైల్వే డ్రైవర్ల కార్యాలయం సమీపంలో ఆన్‌లైన్ డ్రైవర్ల విశ్రాంతి కోసం నిర్మించనున్న మోడల్ రన్నింగ్ రూమ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఈఎన్ కో ఆర్డినేషన్ కృష్ణారెడ్డి, సీనియర్ డీఈఈ ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, సీనియర్ డీఈఈ నవీన్‌కుమార్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, కాజీపేట డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్, కాజీపేట ఏడీఈఎన్‌లు ఎంఆర్ కె.రాజు, విష్ణు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

బది'లీలలు'

ముడుపులు అందజేసి నచ్చిన చోట పోస్టింగ్
- రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా స్థానచలనం
- ఉమ్మడి వరంగల్ జిల్లా దాటని సబ్ రిజిస్ట్రార్లు
- మ్యూచువల్‌ను తలపిస్తున్న బదిలీలు
- చక్రం తిప్పిన ఉద్యోగ సంఘాల నేతలు



కాజీపేట అర్బన్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఐజీ, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 స్థాయిలో బది'లీలలు' జరిగాయి. పదేండ్లకు పైబడి ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం కల్పించేందుకు చేపట్టిన బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆశీర్వాదంతో నచ్చిన దగ్గర పోస్టింగ్ పొందినట్లు రిజిస్ట్రేషన్ శాఖలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎట్టకేలకు కదిలారు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏండ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో విధులు కొనసాగిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు ఎట్టకేలకు బుధవారం వెలువడిన బదిలీలతో కదిలారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా దాటని సబ్‌రిజిస్ట్రార్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 అధికారులు మల్టీ జోన్–1లో భాగంగా రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. అయితే ఉన్నతాధికారుల అండతో ఉమ్మడి వరంగల్ జిల్లా దాటకుండా తాము ఎంచుకున్న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పోస్టింగ్ సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గ్రేడ్–1,గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు మ్యూచువల్‌ను తలపించాయి. వరంగల్ ఆర్వోలో విధులు నిర్వహిస్తున్న సంపత్‌కుమార్ జనగామ, జనగామలో విధులు నిర్వహిస్తున్న అమ్జద్‌అలీ వరంగల్ ఆర్వో, ములుగు సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహబూబాబాద్, వరంగల్ ఫోర్ట్‌లో విధులు నిర్వహిస్తున్న మసీయుద్దీన్ వరంగల్ రూరల్, వరంగల్ రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న సుజాత డీఐజీ కార్యాలయానికి , నర్సంపేటలో విధులు నిర్వహిస్తున్న కార్తీక్ వరంగల్ రూరల్‌కు కేటాయించారు. ఈ విధంగా ఏ అధికారి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా దాటలేదు.

చక్రం తిప్పిన ఉద్యోగ సంఘాల నాయకులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రేడ్–1,గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో ఉద్యోగ సంఘాల నేతలు చక్రం తిప్పి ఉమ్మడి వరంగల్ దాటకుండా అడ్డుపడ్డారని తెలుస్తోందని పలువురు పేర్కొన్నారు. భారీగా బదిలీలు జరుగుతాయనే సమచారంతో లాంగ్ స్టాండింగ్ గ్రేడ్–1,గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు లాంగ్ లీవ్ పెట్టి హైదరాబాద్‌కు మకాం మార్చి ఉన్నతాధికారుల అధికారుల ఆశీర్వాదం కోసం ఉద్యోగ సంఘాల నేతలతో జతకట్టారు.

బదిలీలు ఇలా...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డీఐజీ, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 అధికారులను బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్ డీఐజీగా – ఎం.సుభాషిణి
మహబూబాబాద్–తస్లీమా మహమ్మద్
జనగామ–టి.సంపత్‌కుమార్
వరంగల్ రూరల్–మసీయుద్దీన్
వరంగల్ ఫోర్ట్– ఏ.కార్తీక్
వరంగల్ ఆర్వో–ఎండీ.అమ్జద్ అలీ
నర్సంపేట– రామ కిశోర్ రెడ్డి
డీఐజీ కార్యాలయం–డి.సుజాత

ఉమ్మడి వరంగల్‌లో లాంగ్ స్టాండింగ్ ఇలా..

గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్లు..	గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు..
ములుగు–13 సంవత్సరాలు	వరంగల్ ఫోర్ట్– 8 ఏళ్లు
వరంగల్ రూరల్–6	నర్సంపేట–8 ఏళ్లు
వరంగల్ ఆర్వో–4	జనగామ–9 ఏళ్లు
డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్–5	

యువతులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ డేవిడ్ రాజు

వరంగల్ క్రైం/హసన్‌పర్తి: షేర్ చాట్, స్నాప్ చాట్ యాప్‌ల ద్వారా యువతులను మోసం చేస్తున్న వ్యక్తిని హసన్‌పర్తి పోలీసులు అరెస్ట్ చేసి ఓ యువతిని కాపాడారని కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా కలమర్ల గ్రామానికి చెందిన ఇమ్రాన్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో షేర్‌చాట్, స్నాప్ చాట్ యాప్‌ల ద్వారా మహిళలు, యువతులతో చాటింగ్ చేయడానికి ప్రణాళికలు రచించాడు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండలానికి చెందిన ఓ యువతితో రెండు నెలల క్రితం షేర్ చాట్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. ఆ తరువాత వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుతూ తాను ధనవంతుడినని, తన వద్దకు వస్తే ఇద్దరం కలిసి ఉందామని నమ్మించాడు. దీంతో సదరు యువతి ఈనెల 8వ తేదీన బంగారం తీసుకుని నిందితుడితో కలిసి జీవించేందుకు సత్యసాయి జిల్లాకు వెళ్లింది. అనంతరం ఆ బంగారాన్ని నిందితుడు ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి రూ.1.50 లక్షల తన ఖాతాలోకి మళ్లించున్నాడు. ఇదిలా ఉండగా సదురు యువతి కుటుంబీకులు ఆమె అదృశ్యమైందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న హసన్‌పర్తి పోలీసులు ఆధునిక టెక్నాలజీ ద్వారా యువతిని పట్టుకున్నారు. బుధవారం రైలులో కాజీపేట మీదుగా విజయవాడకు వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడితో పాటు సదరు యువతిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ డేవిడ్ రాజు తెలిపారు. అనంతరం పోలీసులు యువతిని కుటుంబీకులకు అప్పగించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

నెల్లికుదురు: హత్యాయత్నం కేసులో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీహెచ్ సురేష్ జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మీఠ్యాతండాలో 2016 సంవత్సరంలో తండాకు చెందిన గుగులోతు వీరన్న, వడివేలు సర్వనన్ అనే వ్యక్తి మధ్య భూవివాదంపై గొడవ జరిగింది. ఈ విషయంలో తనపై వీరన్న గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడ్డారని సర్వనన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి.రాజుకుమార్ కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖాలు చేశారు. అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీహెచ్ సురేష్ కేసులోని సాక్షులను విచారించిన అనంతరం నిందితుడు వీరన్నకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

దివ్యాంగులకు మరింత 'ఆసరా'



దివ్యాంగుడికి పింఛన్ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో కలెక్టర్ శశాంక

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం.. దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంచి ఆదుకుంటోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో దివ్యాంగులకు ఆసరా పింఛన్ల పెంపు పత్రాలు అందజేశారు. కలెక్టర్ కె. శశాంకతో కలిసి పలువురికి పెంచిన పింఛన్ల మొత్తాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మానవీయ దృక్పథంతో దివ్యాంగులకు పింఛన్‌ను రూ.3016 నుంచి రూ.4016కు పెంచి ఆదుకుంటున్నారని తెలిపారు. 2014కు ముందు రూ.500 పింఛన్ మాత్రమే అందేదని..తొమ్మిదేండ్లలో ఎనిమిదింతలు పెరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఇ స్తున్న పింఛన్లు మరే రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎ క్కడా తెలంగాణలో ఇస్తున్న పింఛన్లు అమలు కావడం లేదన్నారు. వృద్ధాప్య పింఛన్ వయసును 2020 మార్చిలో 60 ఏండ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. అనంతరం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయగా దీని నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, తొర్రూరు, పెద్దవంగర ఎంపీపీలు చిన్న అంజయ్య, రాజేశ్వరి, జెడ్పీటీసీలు శ్రీనివాస్, జ్యోతిర్మయి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మాటలన్నీ అబద్ధాలే



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

- సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

హన్మకొండ: సీఎం కేసీఆర్.. పూటకో మాట మాట్లాడుతారని, అవీ అబద్ధాలే చెబుతారని ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ విమర్శించారు. తమకు ఉద్యోగభద్రత కల్పిస్తూ, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కువద్ద చేపట్టిన దీక్షలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్.. కరోనా సమయంలో ఏఎన్‌ఎంలను దేవుళ్లతో పోల్చారని, ఇప్పుడు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేస్తామని చెప్పి.. నేడు మాట తప్పుతున్నారని మండిపడ్డారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఉపాధ్యక్షులు యాకోబు, విక్టోరియా, సుమలత, నాయకురాళ్లు సుజాత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వృద్ధుడి దారుణ హత్య

- భార్య కళ్ల ఎదుటే కత్తితో గొంతుకోసిన దుండగులు
- భూ వివాదమే హత్యకు కారణమంటున్న మృతుడి బంధువులు
- వరంగల్ నగరంలో ఘటన



రాంచందర్ (ఫైల్)



రాంచందర్ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య, కుమార్తె, కుమారులు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో బుధవారం ఉదయం ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి భార్య కళ్లెదుటే వృద్ధుడిని కత్తితో గొంతు కోసి పరారయ్యారు. భూ వివాదమే హత్యకు కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడి బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన నాము తాబాజీ రాధాబాయ్, రాంచందర్(65) దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాంచందర్ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహించి రిటైరయ్యారు. పదేళ్ల క్రితమే ఎస్ఆర్ఆర్‌తోటలో ఇల్లు కట్టుకొని స్థిరపడ్డారు. పిల్లలకు పెళ్లి వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. ప్రస్తుతం రాధాబాయ్, రాంచందర్ మాత్రమే ఎస్ఆర్ ఆర్‌తోటలోని ఇంట్లో నివాసం ఉంటున్నారు. రాంచందర్‌కు పరకాల నియోజవర్గం పత్తిపాక శాయంపేట గ్రామంలో 1.20గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి విషయమై స్థానికుడి నడమ వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 11.20 నిమిషాలకు గుర్తు తెలియని వ్యక్తులు ఎస్ఆర్‌తోటలో రాంచందర్ పేరు పెట్టి పిలుస్తూ ఇంట్లోకి ప్రవేశించారు. ఎవరో వచ్చారు అని భార్య రాధాబాయ్ చెప్పగానే బెడ్రూం నుంచి హాల్‌లోకి ప్రవేశించిన రాంచందర్‌ను దుండగులు కింద పడేసి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి పరారయ్యారు. ఆ దృశ్యం చూసిన భార్య షాక్‌కు గురైంది. రక్షించండి అంటూ రాంచందర్ ఇంట్లోనుంచి రోడ్డుపైకి చేరి రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్.. ఎస్సై శ్రీలత, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు నాము తాబాజీ ప్రదీప్ చందర్ మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యా నేరం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ తెలిపారు.

భూ వివాదమే హత్యకు కారణమా..?

వృద్ధుడి హత్య అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా..? పాత కక్షలు ఏమైనా ఉన్నాయా..? పత్తిపాక శాయంపేటలోని 1.20 గంటల భూ వివాదమే హత్యకు కారణమా..? భూ వివాదంపై పట్టు వీడడం లేదనే కక్షతో గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేసి ఉంటారా..? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పత్తిపాక శాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి రాంచందర్ నడమ భూవివాదం ఉందని, మృతుడి కుమారుడు ప్రదీప్ చందర్ చెప్పడంతో సదరు వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. హత్య చేసి పరారైన వ్యక్తులు ముందుగా ఎక్కడినుంచి ఇంటికి చేరుకున్నారు..? ఆ తరువాత ఏ దారిలో వెళ్లి ఉంటారు..? అనే దానిపై సీసీ ఫుటేజీలను సైతం పరిశీలించినట్లు తెలిసింది.

పంట రుణం చెల్లించలేదని..

- రైతుబంధు నగదు ఇవ్వని బ్యాంకు అధికారులు



రైతుబంధు నగదు ఇప్పించాలని వేడుకుంటున్న ఈరమ్మ, ఆమె కుమారుడు సంతోష్

బయ్యారం: పంట రుణం చెల్లించలేదని నెపంతో ఓ మహిళా రైతుకు బ్యాంకు అధికారులు రైతుబంధు నగదును నిలిపివేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో జరిగింది. మండలంలోని గురిమెళ్లకు చెందిన మహిళారైతు గుగులోత్ ఈరమ్మకు ఏడు ఎకరాల పోడుభూమి ఉంది. 2007లో ఈరమ్మ బయ్యారంలోని అప్పటి ఆంధ్రాబ్యాంకు ప్రస్తుత యూనియన్ బ్యాంకులో రూ.50వేల పంట రుణం తీసుకుంది. ఆ తరువాత పోడుభూములకు రెవెన్యూ అధికారులు పహాణీలు ఇవ్వడం నిలిపివేశారు. దీంతో బ్యాంకులో రుణం రెన్యువల్ కాకుండా నిలిచింది. ఇటీవల ప్రభుత్వం పోడు పట్టాలు ఇవ్వడంతోపాటు రైతుబంధు నిధులు జమచేయడంతో సదరు మహిళా రైతు రైతుబంధు నగదు తీసుకునేందుకు కుమారుడు సంతోష్‌తో కలిసి బుధవారం బ్యాంకు వద్దకు వచ్చింది. అయితే బ్యాంకులో పంట రుణం చెల్లించలేదని, రైతుబంధు డబ్బులు ఇవ్వమని అధికారులు తెలపడంతో ఆందోళనకు గురైంది. రైతుబంధు డబ్బులు పెట్టుబడికి అవసరం అవుతాయనుకుంటే బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని, తనకు డబ్బులు ఇప్పించాలని అధికారులను వేడుకుంది. కాగా, ఈ విషయంపై బ్యాంకు అధికారులను సంప్రదించగా మేనేజర్ అందుబాటులో లేరని, ఆయన వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

బీసీలను వంచిస్తున్న పార్టీలు

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



బీసీ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: బీసీ కులాలను రాజకీయ పార్టీలు వంచిస్తున్నాయని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఆరోపించారు. బుధవారం వరంగల్ ఎల్‌బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్‌హాల్‌లో ఓరుగల్లు బీసీ రాజ్యాధికార గర్జన ఆహ్వాన కమిటీ చైర్మన్ ధర్మపురి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీఆర్ఎస్ ప్రకటించిన జాబితాలో పరిగణించకపోవడం, పద్మశాలీలను కేవలం ఒకే స్థానానికి పరిమితం చేయడం, విశ్వబ్రాహ్మణ, పెరిక, నాయీ బ్రాహ్మణ, కురుమ, కుమ్మరి వర్గాలకు ఏమాత్రం ప్రాతినిత్యం కల్పించకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఆగస్టు 27న వరంగల్‌లో జరిగే బీసీ రాజ్యాధికార గర్జనలో అన్ని కులాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈగర్జలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుగేందర్‌యాదవ్, కేడల ప్రసాద్, చేపూరి ఓదెలు, ఆడేపు నగేష్‌నేత, చింతాల అనిల్, అల్లాడి యాకయ్య, కీర్తి జయంతి, సాంబరాజు ప్రభాకర్, కడారి రవి, పరిమళ లక్ష్మణ్, సదానందం, మడత కిశోర్, యాదగిరి, గీసబోయిన ఆకాష్, బేతి రమేష్, బేతి రాజు, సట్ల సాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దాతలూ.. ఆర్థిక చేయూతనందించండి

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి వేడుకోలు



సంగీత

చిల్పూరు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఓ క్రీడాకారిణి.. తనకు దాతలు ఆర్థిక చేయూతనందించాలని వేడుకుంటోంది. మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన దూడల సంగీత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంది. అక్కడ ప్రతిభకనబరిచి అక్టోబర్ 5నుంచి 7వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే పోటీలకు రాష్ట్రం తరుపున ఎంపికైంది. అయితే పోటీలకు వెళ్లడానికి తనకు ఆర్థిక స్తోమత లేదని, దీనిపై దాతలు స్పందించి సాయం చేయాలని సంగీత కోరారు. సాయం చేయాలనుకునే వారు పీఈటీ వంశీ కృష్ణ 9000266996 నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా చేయూతనందించాలని కోరారు.

పేదింటి విద్యా కుసుమానికి ఎంబీబీఎస్ సీటు



మెడికల్ సీట్లు సాధించిన అక్కాచెల్లెళ్లు

నయీంనగర్: ఓ పేదింటి విద్యార్థిని నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందింది. హనుమకొండ పోచమ్మకుంటకు చెందిన జనగాం సురేష్, కవిత దంపతుల కూతురు హరిప్రియ.. కన్వీనర్ కోటాలో భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. గతంలో హరిప్రియ సోదరి జనగాం శరణ్యప్రియ కూడా కన్వీనర్ కోటాలోనే కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం విశేషం. ఒకే కుటుంబంలో అక్కాచెల్లెళ్లు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో వారిని పలువురు అభినందించారు. కాగా, హనుమకొండ హనుమాన్‌నగర్ డబ్బాల సెంటర్‌లో చిన్న దుకాణం నడుపుకుంటూ ఇద్దరు కూతుళ్లను ఉన్నతంగా చదివిస్తున్న సురేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

- కడియం సభకు వస్తుండగా ఘటన..



కొమురమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక పాత రైల్వే గేట్ సమీపంలో కాలినడకన రైల్వే ట్రాక్‌ను దాటుతున్న ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని రైలు ఢీకొట్టగా ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఐనవోలు మండలం గర్మిళ్లపల్లికి చెందిన పిడుగు కొమురమ్మ(60) బుధవారం డివిజన్‌కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సభకు వచ్చింది. కాగా, ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు కలిపేలా ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జి పూర్తయి వినియోగంలోకి రాగా కొద్ది నెలల క్రితం రైల్వేగేటు పూర్తిగా మూసివేశారు. అయితే పాదాచారులు పాత గేటు మార్గం గుండా వెళ్తున్నారు. ఈ క్రమంలో కొమురమ్మ పాతగేటు వద్ద నుంచి రైల్వేట్రాక్ దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి ఖాజీపేటకు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై పరశురాములు తెలిపారు.

ఇద్దరు లారీ డ్రైవర్ల అరెస్ట్

- యజమానిపై కేసు నమోదు

వర్ధన్నపేట: లారీ.. ఆటోను ఢీకొన్న ఘటనలో ఆరుగురి మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఇద్దరు లారీ డ్రైవర్లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని వర్ధన్నపేట ఏసీపీ సురేష్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన మండలంలోని ఇల్లంద గ్రామంలో లారీ.. ఆటోను ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందారన్నారు. ఆ సమయంలో లారీ నడిపిన డ్రైవర్ మదన్‌లాల్ నాయక్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేదు. మరో డ్రైవర్ రాజేష్ మీనన్‌కు ఉన్నా గడువు తేదీ ముగిసిందన్నారు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే, లారీ యజమాని కన్యాలాల్‌పై కూడా కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారని ఏసీపీ సురేష్ పేర్కొన్నారు.